క్లుప్తంగా

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెడ్‌కానిస్టేబుల్

నాగారం : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హెడ్‌కానిస్టేబుల్ వెంకయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నాగారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అత్యవసర సమయంలో 100కు కాల్ చేయాలని, అపరిత వ్యక్తులు ఇచ్చిన తినుబండారాలు తీసుకోవద్దని, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకొని భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.మల్లయ్య, ఉపాధ్యాయులు వెంకటమల్లు, వీరేష్, రవీనా, పోలీసు సిబ్బంది చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సాయి మందిర తృతీయ వార్షికోత్సవం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగా షిరిడీ సాయి మందిరం తృతీయ వార్షికోత్సవం గురువారం జరగనుంది. ఈ వార్షికోత్సవానికి సంబంధించి మందిరాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 6గంటలకు పంచామృత అభిషేకం, అలంకరణ, 8.30 గంటలకు విశేష అర్చన, ప్రసాద వితరణ, 12 గంటలకు మధ్యాహ్నహారతి, అన్నదానం, సాయంత్రం 5.30 గంటలకు సంధ్యాహారతి, 6.30 గంటలకు పల్లకి ఉత్సవం, గ్రామ సంకీర్తన, రాత్రి 8.30 గంటలకు శేజారతి, పవళింపు సేవ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కడియం రామచంద్రయ్య, ఆలయ చైర్మన్ వి. శ్రీనివాస్‌రావు, ఆలయ అర్చకుడు ఖండవిల్లి సాయిరాం తెలిపారు. భక్తులు ఈ వార్షికోత్సవానికి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వన నర్సరీ పరిశీలన



వన నర్సరీని పరిశీలిస్తున్న డీఏఓ

అర్వపల్లి : తెలంగాణకు హరితహారంలో భాగంగా వన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను వేసవిలో ఎండిపోకుండా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ కోరారు. మంగళవారం పర్సాయపల్లిలో వన నర్సరీని పరిశీలించారు. ప్రతిరోజు మొక్కలకు నీళ్లు పెట్టి సంరక్షణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమేష్‌చారి, సర్పంచ్ పుష్పాల శేఖర్, ఏపీఓ ఉపేందర్, కార్యదర్శి కృష్ణవేణి, వార్డు సభ్యులు సైదులు, లచ్చిరాం, టీఏ దీపిక, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సూర్యక్షేత్ర వార్షికోత్సవం

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతిస్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్ర వార్షికోత్సవం బుధవారం జరగనుంది. ఈ సందర్భంగా ఉదయం క్షేత్రంలో సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు, సాయంత్రం 5గంటలకు సూర్యనారాయణస్వామి కల్యాణమహోత్సవం జరగనున్నాయని క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి తెలిపారు. వార్షికోత్సవానికి భక్తులు తరలిరావాలని కోరారు.

సీఐ మన్మోహన్‌కు అభినందన



సీఐను సన్మానిస్తున్న డీజీపీ అంజనీకుమార్, మహేష్ భగవత్, అభిలాష బిస్త్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన ఎల్లెంల మన్మోహన్ ఎల్బీనగర్ సీసీఎస్ సీఐగా పనిచేస్తూ ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్‌లో నిర్వహించిన ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో లా పరీక్షలో గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో ఆయనను మంగళవారం రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, సీఐడీ అదనపు డీజీపీ మహేష్ భగవత్, అదనపు డీజీపీ అభిలాష బిస్త్‌లు డీజీపీ కార్యాలయంలో అభినందించి సన్మానించారు.

బహుమతుల ప్రదానం

తిరుమలగిరి : విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయడమే లయన్స్ క్లబ్ ఉద్దేశమని ఆ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రంగౌడ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఐత శ్రీనివాస్, కోశాధికారి సురేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

నిమిషాల్లో బిల్లింగ్.. వెంటనే అప్‌డేట్

- విద్యుత్ బిల్లుల జనరేట్‌లో నూతన విధానం తెచ్చిన విద్యుత్‌శాఖ
- ఫోన్ ద్వారానే మీటర్ రీడింగ్ తీయనున్న సిబ్బంది



ఫోన్‌తో మీటర్ రీడింగ్ తీస్తున్న విద్యుత్ సిబ్బంది

పెన్‌పహాడ్ : విద్యుత్ మీటర్ రీడింగ్ ఫోన్ నుంచే తెలుసుకోవచ్చు. బిల్లింగ్ కోసం టీఎస్ఎస్‌పీడీసీఎల్ నూతన విధానం అమలులోకి తీసుకువచ్చింది. సెల్‌ఫోన్‌తో మీటర్ రీడింగ్‌ని స్కాన్ చేసి బిల్లు తీసుకునే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికత వైపు విద్యుత్ శాఖ అడుగులు వేస్తోంది. ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌లతో పాటు ఫోన్‌లోని యాప్ నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించే విధానం అమల్లోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం అదే ఫోన్ ద్వారా మీటర్‌ను స్కాన్ చేసి రీడింగ్ తీసే విధానం అమల్లోకి వచ్చింది. పెన్‌పహాడ్ మండలంలో ఈ విధానం అమలుచేస్తున్నారు.

పాత విధానంలో సాంకేతిక సమస్యలు..

గతంలో విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ మీటర్ రీడింగ్ పుస్తకంలో రాసుకుని వారం తర్వాత వినియోగదారుడికి బిల్లు ఇచ్చేవారు. ఈ విధానం వినియోగదారులకు, సంస్థకు ప్రయోజనకరంగా లేకపోవడంతో స్పాట్ బిల్లింగ్ యంత్రాలను ప్రవేశపెట్టి ఇంటి వద్దే బిల్లు తీసి ఇచ్చేవారు. ఇందులో కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయి. యంత్రంలో బిల్లు నమోదైన అనంతరం దాన్ని కంప్యూటర్‌కు అనుసంధానించి సర్వర్‌లో అప్‌లోడ్ చేసే వారు. దీనికి మూడు రోజుల సమయం పట్టేది. అప్‌లోడ్ సమయంలో సాంకేతిక సమస్యల కారణంగా కొన్ని సర్వీసులకు సంబంధించి బిల్లులు హెచ్చుతగ్గులుగా నమోదవ్వడం, తదితర సమస్యలు ఉత్పన్నమయ్యేవి. యంత్రాలు మరమ్మతులకు గురైతే రోజుల తరబడి రీడింగ్‌కు సిబ్బంది రాని పరిస్థితి ఉండేది.

ప్రస్తుత విధానంతో..

ఇకపై విద్యుత్ సిబ్బంది ఉపయోగించే ఫోన్‌తోనే విద్యుత్ మీటర్ రీడింగ్ తీయనున్నారు. ఉద్యోగికి యూజర్ ఐడీతో పాటు ప్రత్యేకంగా పాస్‌వర్డ్ కేటాయించారు. ఫోన్‌లో నమోదైన రీడింగ్ ప్రింటింగ్ తీయడానికి ప్రత్యేక యంత్రాన్ని సమకూర్చనున్నారు. మీటర్ వద్దకు ఫోన్ తీసుకెళ్లగానే మీటర్ రీడింగ్ నమోదవుతుంది. అదే సమయంలో ఫొటో తీస్తుంది. వెను వెంటనే బిల్లు మొత్తం ప్రింటర్ నుంచి చీటి రూపంలో వస్తుంది. ఫోన్ నుంచి విద్యుత్ సంస్థ సర్వర్‌కు నేరుగా కనెక్టయి అప్‌లోడ్ అవుతుంది. ఇదంతా నిమిషం వ్యవధిలోనే పూర్తవుతుంది.

పారదర్శకంగా బిల్లింగ్



ఫోన్ ద్వారా విద్యుత్ మీటర్ రీడింగ్ తెలుసుకొని బిల్లులు చెల్లించే విధానం పెన్‌పహాడ్ మండలంలో అమలు చేస్తున్నాం. ఈ విధానం సౌకర్యవంతంగా ఉండడంతో పాటు వినియోగదారులకు పారదర్శకమైన వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. దీంతో బిల్లులో ఎలాంటి హెచ్చుతగ్గులు, తప్పులు జరగవు.

– మహేష్, విద్యుత్ ఏఈ

కంటి వెలుగు శిబిరాల ప్రారంభం



రాజానాయక్ తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ స్నేహలత

తిరుమలగిరి : పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. మంగళవారం రాజానాయక్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి వందన, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, బానోతు సరితాసుధాకర్, సమతారాణి, స్వరూపాకుమారి, సంధ్యారాణి, పంచాయతీకార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

కంటి వెలుగుపై అవగాహన

నాగారం : ఫణిగిరి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమంపై కళాజాతా బృందం సభ్యులు మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ వేముల నరేష్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం కంటివెలుగు, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, హరితహారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు తమ ఆట, పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు డప్పు సుధాకర్, నెమ్మాది స్రవంతి, నిర్మల, రాధ, శంకర్, సైదులు, భిక్షపతి, శ్రవణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు అన్ని రకాల వైద్యసేవలు

చివ్వెంల : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు అన్ని రకాల వైద్యసేవలు అందించడమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని వట్టిఖమ్మంపహాడ్ సర్పంచ్ కలకొండ కరుణ శ్యాంసన్ అన్నారు. మంగళవారం గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కంటి సమస్య ఉన్న వారికి అద్దాలు పంపిణీ చేసి, ఆపరేషన్ అవసరమైన వారిని రెఫర్ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రేణుక, హెల్త్ సూపర్‌వైజర్లు శేషయ్య, శిరోమణి, ఆప్తిమాలిట్ నరేందర్, సలీమ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్ఎం రాణి, ఆశావర్కర్లు విజయ, దీవెనమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్



నాగారం : కంటి వెలుగుపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం సభ్యులు

జిల్లా స్థాయిలో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థి ఈశ్వర్

సూర్యాపేట రూరల్ : రాష్ట్ర ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభా పోటీల్లో ఇమాంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థి ఈశ్వర్ ప్రథమస్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ శంకర్‌నాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

స్టార్టర్ల తొలగింపు అప్రజాస్వామికం

నూతనకల్ : రైతుల విద్యుత్ మోటార్లకు ఆటోమెటిక్ స్టాటర్లను ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించడం అప్రజాస్వామికమని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. రైతులు వచ్చిపోయే కరెంట్‌కు సమయానుకూలంగా మోటార్లను ఆన్‌చేయలేని పరిస్థితుల్లో ఆటోమెటిక్ స్టార్టర్లను ఏర్పాటు చేశారని తెలిపారు. స్టార్టర్లను తొలగించడానికి చేపట్టిన చర్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్‌రెడ్డి, మద్దెల రామ్మూర్తి, రవి, వీరన్న పాల్గొన్నారు.

ఈ–కేవైసీపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి

తిరుమలగిరి : ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రైతులకు డబ్బులు పడాలంటే ఈ–కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం తొండ గ్రామంలోని రైతు వేదికలో రైతులకు ఈ–కేవైసీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తిరుమలగిరి మండలంలో 469 మంది రైతులు ఇంకా ఈ–కేవైసీ నమోదు చేసుకోలేదని, రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మామిడాల సర్పంచ్ బెడిదె కరుణాకర్, రైతులు వెంకటయ్య, యాదయ్య, శ్రీశైలం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శివకుమార్

తిరుమలగిరి : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ బి.శివకుమార్ అన్నారు. తిరుమలగిరిలో మంగళవారం వివిధ కుల సంఘాలతో రౌండ్ టేబు ల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. యువత గంజాయికి బానిస కావొద్దని సూచించారు. గంజా యిని విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సా మాజిక కార్యకర్త గఫార్‌ఖాన్, కొత్తగట్టు మల్లయ్య, లక్ష్మయ్య, పత్తెపురం యాదగిరి, కందుకూరి సోమయ్య, తన్నీరు రాంప్రభు, వెంకన్న, లింగయ్య, షకీల్, శ్రీనివాస్, చారి, కిష్టునాయక్, నాగరాజు, నరేష్, మల్లయ్య పాల్గొన్నారు.

20నుంచి గ్రామాల్లో పోస్టల్ మహా మేళా



క్యాంపెయిన్ నిర్వహిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : పోస్టల్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు 20 నుంచి 25వరకు గ్రామాల్లో నిర్వహించే పీఓఎస్బీ మహామేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ పోస్టుమాస్టర్ చలిగంటి కవిశ్రీలేఖ కోరారు. మంగళవారం లింగాల గ్రామంలో పోస్టల్ మహామేళాలో భాగంగా క్యాంపెయిన్ నిర్వహించి మాట్లాడారు. పోస్టల్ శాఖలో ఉండే పొదుపు పథకాల్లో అధిక వడ్డీ రేటు లభిస్తుందని తెలిపారు. ఈ పథకాల్లో ఆర్డీ, ఎస్బీ, ఎస్ఎస్ఏ, టీడీ, ఆర్పీఎల్ఐ పథకాలు పేదలకు ఎంతో మేలైనవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీపీఎం పుల్లయ్య, గ్రామస్తులు కేసరి శోభ, రంగారెడ్డి, మామిడి నాగమణి, మజ్జికపు నర్సిరెడ్డి, మామిడి భిక్షం, గుండు కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పసునూర్ మోడల్‌స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నాగారం : పసునూర్ మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో విద్యార్థులు మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధుల, అధికారుల, ఉపాధ్యాయుల వేషధారణల్లో అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.రమేష్, ఉపాధ్యాయులు ఎం.రమేష్, భూతం యాకమల్లు, శ్రీనివాస్, జి.రాజేంద్రకుమార్, కావలి కార్తీక్, మానసవీణ, సెరినా, కరుణాకర్, హరిత, రాజ్‌కుమార్, జగన్, గణేష్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీజేపీదే విజయం



మాట్లాడుతున్న భూతం సాగర్

మద్దిరాల : బీఆర్ఎస్ నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జి.కొత్తపల్లి గ్రామంలో ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహిస్తుంటే కొంత మంది కావాలనే అడ్డుకుని అరాచకాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జి.కొత్తపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు ఉబ్బని వెంకన్న, పగిళ్ల వెంకన్న, జంపాల ఉపేందర్, పులిగిల్ల వాసుదేవరాజు, మహేష్, గాజుల స్వామి, మెట్టుకోల వెంకన్న పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో కొనసాగుతున్న ఉత్సవాలు



అగ్నిగుండాల్లో నడుచుకుంటూ వెళ్తున్న భక్తులు

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి శివాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారు జామున ఎరకేశ్వర స్వామి దేవాలయం ఎదుట అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఎంతో మంది భక్తులు భక్తి శ్రద్ధలతో అగ్ని గుండాల్లో నడిచారు. ఈ వేడుకల్లో శివాలయ కమిటీ చైర్మన్ జేరిపోతుల భిక్షం, డైరెక్టర్లు షేక్ జానిమియా, చెరుకుపల్లి ఉపేందర్, భవాని, చింత శోభ, మండలి నాగయ్య, సట్టు సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న తిరుపతయ్య

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దందోలు తిరుపతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో మౌలిక వసతులు లేవని, గుంతలు పడిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బస్టాండ్‌లో కనీస వసతులు కరువయ్యాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బహుజనుల రాజ్యాధికారం కోసం ప్రజలు చైతన్యవంతులై బీఎస్పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చింతకుంట్ల చింతయ్య, ప్రధాన కార్యదర్శి ఎర్ర రాంబాబు, ఎర్ర సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

సూర్యాపేట రూరల్ : ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 1వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ శంకర్ నాయక్ మంగళవారం తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చివ్వెంల : రంగారెడ్డి జిల్లా కోర్టు అడ్వకేట్ పై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్‌అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సీనపల్లి సోమేశ్వర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని చౌళ్లతండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్దన్‌రెడ్డి, సర్పంచ్ లావుడ్యా వెంకన్న, ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, ఉపసర్పంచ్ బాణోతు లింగనాయక్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చౌళ్లతండాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎస్‌ఏ.రజాక్

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ నర్సింహారావు

నాగారం : రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని సర్పంచ్ గుట్టు నర్సింహారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఫణిగిరి రైతువేదికలో ఆయిల్‌పాంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నీటి వసతి ఉన్న రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పాం సాగు చేసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలిక పంటను తీసే అవకాశం ఉందని తెలిపారు. ఆయిల్‌పాంకు నికరమైన ధర, మంచి మార్కెట్ సౌకర్యం ఉందని తెలియజేశారు. అంతేకాకుండా రైతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ప్రాంతీయ ఉద్యాన అధికారి వి.స్రవంతి, ఎంపీఓ శ్రీనివాస్, ఏఓ గణేష్, ఏఈఓ రమ్యతేజ, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ క్షేత్ర అధికారులు వి.శశికుమార్, రంగు ముత్యంరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి నీటి ఎద్దడిపై సమీక్షా సమావేశం



ఆత్మకూర్ (ఎస్) : మాట్లాడుతున్న ఎంపీపీ



తిరుమలగిరి : మాట్లాడుతున్న ఎంపీపీ స్నేహలత

ఆత్మకూర్ (ఎస్) : వేసవిలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం ఎంపీపీ మర్ల స్వర్ణలత అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో సమావేశం తూతూమంత్రంగా జరిగింది. నీటి ఎద్దడి ఏర్పడకుండా మిషన్ భగీరథ అధికారులు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమన్వయం చేసుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకోవడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ ఈఈ పాపారావు, వెంకటేశ్వర్లు, డీఈఈ పాండునాయక్‌లు పాల్గొని సమీక్షా నిర్వహించారు. కానీ సమావేశానికి ప్రజాప్రతినిధుల్లో కేవలం ముగ్గురు సర్పంచ్‌లు, ఒక్క ఎంపీటీసీ మాత్రమే హాజరయ్యారు. దీంతో పంచాయతీ కార్యదర్శులతోనే సమీక్షా కొనసాగింది. రానున్న ఎండాకాలంలో నీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఏర్పాటు చేసిన ముఖ్యమైన సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకాకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, మిషన్ భగీరథ ఏఈలు రవికుమార్, నవీన్‌రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలి

తిరుమలగిరి : వేసవిలో గ్రామాల్లో మంచి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమేష్‌చారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, వాటర్ గ్రిడ్ ఏఈ జాన్‌ఫ్రెడ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

గీత కార్మికులు గుర్తింపు కార్డులు కలిగి ఉండాలి



సమావేశంలో పాల్గొన్న గీత కార్మికులు

ఆత్మకూర్ (ఎస్) : తాటి చెట్లు ఎక్కుతున్న గీత కార్మికులందరికీ సభ్యత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడ్డి అంజిబాబు గౌడ్ అన్నారు. మండలంలో కొత్తగా తాటి చెట్లు ఎక్కుతున్న దాదాపు 200 మంది గీత కార్మికులకు ఏపూర్ గ్రామంలోని గీత పారిశ్రామిక సహకార సంఘంలో మంగళవారం ఎక్సైజ్ ఎస్‌ఐ పి.కుమారస్వామి టాడీ ట్యాపింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు గౌడ్ మాట్లాడారు. గీత కార్మికులకు గుర్తింపు కార్డు ద్వారానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. 50 సంవత్సరాల నిండిన ప్రతిగీత కార్మికుడికి వృద్ధాప్య పెన్షన్ వస్తుందని తెలిపారు. ఎక్సైజ్ ఎస్‌ఐ కుమారస్వామి మాట్లాడుతూ గీత వృత్తి చాలా ప్రమాదకరమైనదని, కార్మికులు చాలా జాగ్రత్తతో తాడిచెట్లు ఎక్కాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ జమిందార్, నజీర్, నర్మద, కల్లు గీత కార్మిక సంఘం సీనియర్ నాయకుడు అబ్బగాని భిక్షం, మండల అధ్యక్షుడు నోముల వెంకన్న, గ్రామ సొసైటీ అధ్యక్షుడు బుడిగ లింగయ్య, కల్లు గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

ఆత్మకూరు (ఎస్) : దేశ సమైక్యత కోసం రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో పాదయాత్ర స్ఫూర్తితో నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొత్త తండా, బోరింగ్ తండాలో మహా పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలంటే డబల్ బెడ్ రూమ్ ఇల్లు అవసరమని ప్రగల్భాలు పలికిన సీఎం కేసీఆర్ పేద ప్రజలకు ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి అధికార పార్టీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, జానయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సాంబశివరావు జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : ఉద్యమాల ఉపాధ్యాయుడు, దళిత బహుజన మేధావి సాంబశివరావు జయంతి వేడుకలు మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద బహుజన పొలిటికల్ సెంటర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన వామపక్ష నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకన్న, నారబోయిన వెంకట యాదవ్, బుద్ధ సత్యనారాయణ, చామకూరి నర్సయ్య, బోడ భానుప్రసాద్, పంతం యాకయ్య, నాగేందర్ నాయక్, నరేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్ అన్నారు. మంగళవారం 5వ వార్డులో (పద్మశాలి కాలనీలో) నూతనంగా నిర్మించే సీసీ రోడ్లు, డ్రెయినేజీల కోసం అధికారులతో కొలతలు వేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, మేనేజర్ ఖదీర్, సిబ్బంది పరశురామ్ పాల్గొన్నారు.

23న వాహనాల వేలం

సూర్యాపేట క్రైం : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన 5 వాహనాలకు గురువారం ఎక్సైజ్ స్టేషన్‌లో వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరెడ్డి మంగళవారం తెలిపారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.